

# చేసి చూపించు

బిరజా తన కూతురి ఏభై ఆరవ పెండ్లి చూపులను యథాప్రకారం జరపడానికి సర్వ సామగ్రి సమకూర్చాడు. ఇవేం కొత్త కాదు కాబట్టి - పెండ్లి చూపులంటే అదిరి చెదిరి పోవడం బుర్ర భూమిలోకి దించుకోవడం చేయకుండా నిబ్బరంగా వుంది అంబుజవల్లి.

ఉలవపాడు నుంచి వచ్చిన సంబంధం అది.

మెక్కి పోవడానికి వచ్చాడో - మెళ్ళో తాళికట్టడానికొచ్చాడో కాని పెళ్ళి కూతుర్ని మాత్రం శల్య పరీక్ష మొదలెట్టాడు పెండ్లికొడుకు భగవంత రావు. ఇది ఎరిగి చికాగ్గా మొహం పెట్టింది అంబుజవల్లి.

ఖానా పీనా లైనాయి

మంచులో తేలిన మల్లెపూవు లాంటి అంబుజవల్లికి యింత కాలం దాకా ఎందుకు వివాహ భాగ్యం కల్గలేదో ఏపమంతెత్తు అనుమానాస్పద పరిస్థితి ఎదురైనప్పటికీ కొన్ని ప్రశ్నలు ప్రశ్నించాలనుకోవడంలో అవివేకం ఎంత మాత్రం లేదనుకుని మొదలెట్టారు.

"అమ్మాయ్! నీ పేరేంటి?" అడిగింది భగవంతరావుని కన్నతల్లి సుధమ్మ

చెప్పింది సాఫీగా 'అంబుజవల్లి...'

"ఏం చదివావ్!" అడిగాడు భగవంతరావుని మోసిన తండ్రి.

"బి.ఏ" అంది

"ఏమ్మే కానిచ్చావు కాదూ!" పెదవి విరిచింది తల్లి.

"ఏం వచ్చు??" కళ్ళల్లో కాంతిని జార్చేసుకోవాలన్న తపనతో అడిగాడు భగవంతరావు.

"ఏం కావాలి?" ప్రశ్నకు ప్రశ్న సమాధానం కాదని తెలిసే అంది అంబుజవల్లి.

"నాట్యం వచ్చా! వస్తే చేసి చూపించు" అధికారంగా కోరారు.

"ఇప్పుడేవస్తా" అని లోనికి వెళ్ళి టేపు ఆన్ చేసి వచ్చి నృత్యమాడింది.

"కథాకళి రాదా?" అడిగింది సుధమ్మ

రాదని అడ్డంగా తలూపింది.

మూతి విరిచింది సుధమ్మ.

"పాడు" ఆజ్ఞ.

పాడింది కమ్మగా

"ఇంగ్లీషులో మాట్లడడం" ఆ ప్రశ్న పూర్తయ్యేలోగా ఇంగ్లీషు దడదడ లాండించేసరికి వాళ్ళ గుండెలు దడదడలాడిపోయాయి.

"హిందీ"

చక చక హిందీ 'బోలి'ంది

అయినప్పటికీ వారి వదనాల్లో తృప్తి కదలాడ లేదు.

కడుపు నిండా మెక్కి లేచారు. బిరజా ఏదో బోధపరచే ప్రయత్నం మొదలెట్టాడు.

"మైడియర్ భగవంతరావు." అనగానే అంతా వెనుతిరిగారు.

అన్నీచేసాను. కాని మరో విద్య నా దగ్గరుంది. చూపించనా!" సూటిగా ప్రశ్నించింది.

"ఒ.కే! చేసి చూపించు..." ఎప్పటిలా అనేసారు.

అంబుజవల్లి తన ప్రదర్శన ప్రారంభించింది.

దాని ఫలితం వారి ఎముకలు విరిగాయి.

బిరజా విస్తుపోయాడు.

"ఎలా వుందిరా రాస్కెల్స్! ఏ అమ్మాయిని పడితే ఆ అమ్మాయిని అంగట్లో బొమ్మలా చూడ్డమేకాక, ఆమెతో తల తోకా లేని అర్హతలను శోధించి, ప్రశ్నల్తో వేధించడం మీ హాబీ కావచ్చు. మీలాంటివారికి గుణపాఠం చేతల్లో చూపించడం నా హాబీ... గుడ్‌బై" అంది ఆత్మరక్షణ కోసం నేర్చుకున్న కరాటే ఈ విధంగా ఉపయోగపడినందుకు తృప్తి పడిన అంబుజవల్లి.

—కె.కె.రఘునందన

# అమ్మాయిల ప్రశ్నలు అబ్బాయిల సమాధానాలు!



ఈ శీర్షికకు టీనేజ్ అమ్మాయిల నుంచి ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. అమ్మాయిలు తమ ప్రశ్నలతోపాటు తమ ఫోటోలు కూడా జతచేసి పంపించాలి. చక్కటి పద విన్యాసం, లాలిత్యం, కొంటెతనం, సమయస్ఫూర్తి వున్న ప్రశ్నలను మాత్రమే ఎంపిక చేసి అమ్మాయిల ఫోటోలతోసహా పత్రికలో ప్రచురిస్తాం.

ఈ ప్రశ్నలకు టీనేజ్ అబ్బాయిల నుంచి సమాధానాలు ఆహ్వానిస్తున్నాం. అబ్బాయిల సమాధానాలలో సమయస్ఫూర్తి, విషయ పరిజ్ఞానం, మాటకారితనం, హాస్యం ద్యోతకమవ్వాలి. చక్కని సమాధానాలను అబ్బాయిల ఫోటోలతోసహా ప్రచురించడం జరుగుతుంది.

## ముఖ్య గమనిక:

* ప్రశ్నలలో గాని, సమాధానములలో గాని అసభ్యత, అశ్లీలత, జుగుప్సకి తావివ్వరాదు.
* ఎట్టి పరిస్థితిలోను అబ్బాయిల, అమ్మాయిల పూర్తి చిరునామాలు బహిర్గతం చేయడం జరుగదు.
* అబ్బాయిలు అమ్మాయిలు తమ ప్రశ్నలు-ఫోటోలతోపాటు పత్రికలో తమ ఫోటో ప్రచురణకు ఎటువంటి అభ్యంతరము లేదని స్పష్టంగా వ్రాతపూర్వకంగా తెలియజేయాలి.

**అబ్బాయిలూ! అమ్మాయిల ప్రశ్నల కోసం వేచి చూడండి**